


# ఆక్రోశం

**కాసుల ప్రతాప్‌రెడ్డి**

మే నెల

నడినెత్తి మీద సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.

ఒక్కసారి బస్‌స్టాప్ కలియజూశాను. జనం పల్చగా ఉన్నారు. ఒళ్ళంతా చెమటపట్టేసి జిడ్డు కారుతోంది. ఎండలో బయలుదేరడం బుద్ధి తక్కువే అనిపించింది. కానీ పని పూర్తి చేయాలనే పట్టుదల నన్ను నిలవనీయడం లేదు. నెలరోజుల్లోగా పని పూర్తి చేయాలని పార్టీ ఆదేశించింది. పైగా అది నాకు చాలా ఇష్టమైన పని కూడా. అందుకే ఎండను ఖాతరు చేయకుండా ఇల్లు కదిలాను. అరగంటకు పైగానే అవుతోంది. బస్సులు వస్తున్నాయి, పోతున్నాయి. కానీ నేను ఎక్కాల్సిన జూబ్లీహిల్స్ బస్ రావడం లేదు. అలసటతో ఎడమచేతిలో ఉన్న టేపురికార్డర్‌ను కుడిచేతిలోకి మార్చుకున్నాను. చెమటతో చొక్కా తడిసిపోయింది. చిరాగ్గా ఉంది. సాధారణంగా జూబ్లీహిల్స్ వాసులకు బస్సెక్కాల్సిన అవసరం రాదు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ నగరంలోని అతి సంపన్న వర్గాలకు నిలయాలుగా మారాయి. ఆ ప్రాంతాలకు వెళ్తే మరో ప్రపంచంలో అడుగుపెట్టినట్లుంటుంది. జూబ్లీ హిల్స్‌కు వెళ్ళడం ఇది ఐదవసారి. ఈసారైనా పనవుతుందనే నమ్మకం లేదు. అయితే ఈ అపనమ్మకం నా పట్టుదలను దెబ్బతీయటం లేదు. ఈసారి ఎట్లాగయినా రాజేశ్వరమ్మతో మాట్లాడించాలనే పట్టుదల పెరిగింది. రాజేశ్వరమ్మ చూడగానే ఆప్యాయంగా పలకరిస్తుంది. తన గత స్మృతులను, అనుభవాలను చెప్పమన్నపుడు మాత్రం విరుచుకుపడుతోంది, మొండికేస్తోంది.

హైదరాబాద్ స్టేట్ విముక్తి పొంది యాభైఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. తెలంగాణా సాయుధ పోరాట వీరుల ఆత్మకథలను ప్రచురించి ఈ సందర్భంగా యువతరానికి అందించాలనేది పార్టీ లక్ష్యం. ఈ ఆత్మకథలను సేకరించి ఇచ్చే బాధ్యతను పార్టీ నాకు అప్పగించింది. తెలంగాణా పోరాట యోధుల అనుభవాలను మా తరానికి అందించే భాగ్యం నాకే దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. పార్టీ పనిని ముక్కుబడిగా కాకుండా జాగ్రత్తగా అందరూ హర్షించేలా చేయాలనే కోరిక నన్ను నిలువనీయడం లేదు. రాజేశ్వరమ్మ అనుభవాలను రికార్డు చేయడం ద్వారా నా పనికి శ్రీకారం చుట్టాలనుకున్నాను.

రాజేశ్వరమ్మ వయస్సు 70 ఏళ్ళు దాటి ఉంటుంది. ముసలితనం మీద పడినా కూడా ఆమె చూపు మందగించలేదు. చెవిటితనం దరిచేరలేదు. తల మాత్రం ముగ్గుబుట్టలా అయింది. గత అనుభవాలకు ఆనవాలుగా ముఖంపై ముడతలు పడ్డాయి. గొంతు స్పష్టంగా ఉంది. మాటలు సూటిగా శూలాల్లా ఎదుటివారి హృదయాలను తాకుతాయి. తెలంగాణా సాయుధ పోరాటంలో ఆమె భర్త రాజారావు వీరోచిత పాత్ర పోషించాడు. హైదరాబాద్‌స్టేట్ భారతదేశంలో విలీనమైన తర్వాత కూడా పార్టీలో ప్రధాన భూమిక పోషించాడు. పార్టీలో అత్యున్నతమైన పదవిని కూడా చేపట్టి సమర్థవంతంగా పనిచేశాడు. ఆరోగ్య కారణాల రీత్యా ఆయనను పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే కన్నుమూశాడు. ఆయనతోపాటు తెలంగాణా పోరాటంలో రాజేశ్వరమ్మ తుపాకి పట్టి శత్రుమూకలను చెండాడింది. అందుకే ఆమె అనుభవాలను ముందుగా రికార్డు చేయాలనుకున్నాను.

బస్సు రావడంతో నా ఆలోచనలకు తెరపడింది. రష్ తక్కువగానే ఉంది. గబగబా బస్సెక్కి కిటికీ వైపు సీట్లో కూర్చున్నాను. బస్సు కదిలింది. దాంతో చల్లగాలి ఒంటికి తాకింది. చెమటలు ఆరిపోతుంటే హాయిగా ఉంది. రాజేశ్వరమ్మతో ఈసారి ఎట్లాగైనా మాట్లాడించాలని మరోసారి అనుకున్నా, అలా అనుకోవడం బహుశా ఇది వందోసారి అయి ఉంటుంది. సాధ్యమైనంత త్వరగా పని పూర్తి చేయాలని అనుకుంటూ ఎట్లా పనిచేయాలో మనస్సులోనే ఒక ప్రణాళికను సిద్ధం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను. ఇంతలో బస్‌స్టాప్ వచ్చింది. బస్సు దిగి రోడ్డు దాటి రాజేశ్వరమ్మ ఇంటివైపు అడుగులేశాను. బయటి నుంచే ఇంటిని కలియజూశాను. రెండంతస్తుల పెద్ద మేడ. ఇంటి ముందు మిగతా ఇళ్ళు వెలవెలబోతున్నాయి. నాకయితే ఈ ఇల్లొక అద్దాల మేడనే, గేటు తీసుకుని లోనికి అడుగుపెట్టాను. ఇంటి ద్వారానికి ముందు కట్టేసిన డాబర్‌మాన్ హాయిగా నిద్రపోతోంది. నా వాసన పసిగట్టి తలెత్తి చూసి మళ్ళీ నిద్రలోకి జారిపోయింది. మొదటి రోజు నన్ను చూసి నానా యాగీ చేసింది. దాని అరుపులకు నేను తల్లడిల్లిపోయాను. దీనికి కూడా నేను పాత మనిషినై పోయినట్లున్నానని అనుకున్నా. కాలింగ్‌బెల్ నొక్కాను.

తలుపు తెరుచుకుంది. ఎదురుగా దాదాపు పన్నెండేళ్ళ అమ్మాయి. ఇంతకు ముందు వచ్చినపుడు ఈ అమ్మాయిని చూసినట్లు గుర్తులేదు. వాలకం చూస్తే పల్లెటూరి పిల్లలా కనిపించింది. ''రాజేశ్వరమ్మగారున్నారా?'' అని అడిగా.

''లోపలికి రండి'' అంది. లోపలికి వెళ్ళి ఖరీదైన సోఫాలో కూర్చున్నా. అమ్మాయి ఫ్యాన్ వేసి లోనికెళ్ళింది. మెత్తటి సోఫా, చల్లటి గాలి వెనక్కి వొరిగితే నిద్రపట్టేసేట్లుంది. ఆ అమ్మాయి లోనికెళ్ళిన ఐదు నిముషాలకు రాజేశ్వరమ్మ బయటకు వచ్చింది. నేను లేవడానికి ప్రయత్నిస్తూ ''నమస్కారమండీ'' అని చెప్పాను.

నా ఎదురుగా మరో సోఫాలో కూర్చుంటూ ''బాగున్నావా?'' అని అడిగింది రాజేశ్వరమ్మ.

బాగున్నానంటూ తలూపాను.

''పార్వతీ'' అంటూ కేకేసింది. ఇందాకటి అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి రాజేశ్వరమ్మ ఎదురుగా నిలబడింది.

''జూస్ తీసుకురా!'' అంటూ రాజేశ్వరమ్మ పార్వతిని పురమాయించింది. ''విశేషాలేమిటి?'' అంది నావైపు తిరిగి.

''ఏమున్నాయండీ?'' అన్నాను.

''ప్రపంచం గొడ్డుబోయిందేమిటి?'' అంటూ గలగలా నవ్వింది. అలా నవ్వుతున్నపుడు ఆమె పసిపాపలా అనిపించింది.

పార్వతి ట్రేలో జ్యూస్ పట్టుకొచ్చింది. నేను గ్లాసు అందుకుంటూ ''మీరూ...'' అన్నాను.

''నాకు అలవాటు లేదబ్బాయ్. మంచినీళ్ళే అమృతంలాగా తాగేవాళ్ళం'' అంది. జ్యూస్ తాగేసి గ్లాసు టీపాయ్ మీదుంచాను. పనిలో పనిగా పక్కన పెట్టుకున్న టేపురికార్డర్‌ను టీపాయ్ మీదికి చేర్చాను. దాన్ని చూడగానే ''నీ పని ఎందాకా వచ్చింది?'' అని అడిగింది రాజేశ్వరమ్మ.

''అడుగు ముందుకు కదలలేదు. మీరు కదలనిస్తే కదా!'' అన్నాను చొరవ తీసుకుంటూ.

''చూడు బాబూ! నేను ముందే చెప్పా. నాకివన్నీ ఇష్టం లేదు. నేను ఆ విషయాలు మాట్లాడను గాక మాట్లాడను. దీని గురించే అయితే నువ్వు మళ్ళీ ఈ గడప తొక్కొద్దు. దాన్ని మర్చిపోతే నువ్వెప్పుడైనా రావచ్చు. నువ్వేదో ఆవేశంలో ఉన్నావు. రక్తం చల్లారితేగానీ నీకు తెలిసిరాదు'' అంది శాంతంగానే. నా ముఖంలో రంగులు మారడం ప్రారంభమైంది.

''మీరే కాదంటే ఎట్లా?'' అన్నాను బతిమాలుతున్న ధోరణితో. ఇంతలో రాజేశ్వరమ్మ కొడుకు అరుణ్‌కుమార్ బూట్లు టకటకలాడించుకుంటూ వచ్చాడు. నన్ను చూసి - ''హలో, వేణూ! హౌ ఆర్ యూ! నీ పని ఎంతవరకయింది?'' అని అడిగాడు.

పార్టీ ప్రధాన నాయకుల్లో అరుణ్‌కుమార్ ఒకరు. అందువల్ల పార్టీ నాకప్పగించిన బాధ్యతల గురించి ఆయనకు తెలుసు. నేను ఆయన చెంతకు నడిచి - ''ఏమిటోనండి. ఏ మాత్రం పని కావడం లేదు. మీ అమ్మగారి అనుభవాలను రికార్డు చేశాక మిగతావాళ్ళ దగ్గరికి వెళ్దామనుకున్నా. మీ అమ్మగారేమో ఒప్పుకోవడం లేదు. మీరైనా ఒప్పించి నాకు సాయం చేయండి'' అని అన్నానో లేదో రాజేశ్వరమ్మ గాయపడిన పులిలా దూసుకువచ్చింది. ''ఏమిట్రా, వాడు ఒప్పించేది? నాకు చెప్పే మొనగాడయ్యాడా వాడు? వాడేమిటి, వాడి బతుకేమిటి?'' అంటూ అరుణ్‌కుమార్‌పై తిరిగి ''వెధవలందరూ నాయకులయ్యారు'' అని గొణుక్కుంటూ సోఫాలో కూలబడింది. ఈ హఠాత్పరిణామానికి నేను ఖంగుతిన్నాను. అరుణ్‌కుమార్ ముఖంలోకి చూడలేకపోయాను. ఆయన నా వైపయినా చూడకుండా వడివడిగా బయటకు వెళ్ళిపోయాడు. నాకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. గొంతు తడారిపోయింది. మెల్లగా వెనుదిరిగి వచ్చి రాజేశ్వరమ్మ ఎదురుగా సోఫాలో కూలబడ్డాను. ఆమె వైపు చూశా. వెనక్కి ఒరిగి కళ్లు మూసుకుంది. వర్ణనాతీతమైన బాధ ఆమె ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తనలో తానే అనుకుంటున్నట్లు - ''మేం కన్న కలలేమిటి? చూస్తున్నదేమిటి?'' అని అంది. ఆ మాటల బరువు నా గుండెలను తాకింది. ''మా త్యాగాలు వృథా, మా కృషి వృథా. ఇవన్నీ చూస్తూ కూడా ఇంకా బతికుండడం సాధ్యమేనా అని అనిపిస్తోంది. కానీ చావు రావడం లేదు'' అంది. నేను మాట్లాడలేదు. మెల్లగా కళ్ళు తెరిచి నావైపు చూసింది. ''నా కళ్ళెదుటే ఇంత భ్రష్టుపట్టి పోతారనుకోలేదు'' అంది. ఆమె చూపులు ఎక్కడో అనంతంలో చిక్కుకున్నట్లనిపించింది నాకు. ''మానవులందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి బిడ్డలూ చక్కగా చదువుకొని దేశాభివృద్ధికి పనికి రావాలని ఎన్ని కలలు కన్నాం, ఎంత తపన పడ్డాం?! అంతా బూడిదలో పోసిన పన్నీరయింది'' అంటూ నిట్టూర్చి పైటకొంగుతో కళ్ళు ఒత్తుకుంది. ''మా బిడ్డలే మేడలు కట్టాలని, మా బిడ్డలు గొప్పచదువులు చదవాలని మేం అనుకుంటే అంత సంఘర్షణ ఎందుకు, ప్రాణాలకు తెగించి పోరాడడం ఎందుకు?'' అని ప్రశ్నించుకుంది. ఆగి నా వైపు చూసి - ''అడగనే లేదు, ఇంతకీ నువ్వెక్కడుంటావ్?'' అని అంది.

''రాంనగర్‌లో'' అన్నాను మెల్లగా.

''పెళ్ళయిందా?''

''ఇద్దరు పిల్లలు కూడా''

''ఇంటి అద్దె ఎంత?''

''ఐదువందలు''

''అంటే.... చిన్న అద్దెకొంపలో నలుగురు'' నా తల కొట్టేసినట్లనిపించింది. నన్ను కావాలని ఆమె అవమానిస్తోందనిపించింది. ప్రతీకారం తీర్చుకుంటుందా? అనే అనుమానం కూడా కలిగింది.

''మీ ఆవిడ ఏం చేస్తోంది?'' అని మరో ప్రశ్న వేసింది.

''పార్టీ ఆఫీసులోనే క్లర్క్''

''మీరిద్దరు కూడా పార్టీకి ఫుల్‌టైమర్స్. మీకిద్దరికీ కలిపి పార్టీ ఎంతిస్తుందేమిటి?'' ఆమె ముఖం ప్రసన్నంగా మారింది. మాటలు సూటిగా, స్పష్టంగా ఉన్నాయి.

''వేయి రూపాయలు నెలకు''

''మా వాడూ పార్టీ పనే చేస్తున్నాడు కదా!'' అంది వ్యంగ్యం ఆమె మాటల్లో చోటు చేసుకుంది.

''అవును'' అన్నాను. ఈ సంభాషణంతా అనవసరమనిపించింది నాకు.

''అయితే మీ ఇద్దరి జీవిత విధానాల్లో ఇంత తేడా ఎందుకుంది?'' అని అడిగింది. ఈ ప్రశ్నతో నా బుర్ర వేడెక్కింది. నేను మాట్లాడలేదు.

''మాట్లాడవేం?'' అని అడిగింది గద్దిస్తున్నట్లు.

''ఆయన పెద్ద లీడర్ కదండీ!'' అన్నాను.

ఆమె ముఖంలో రంగులు మారడం నాకు స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. ఏదో చెప్పాలని ప్రయత్నించింది. కానీ కోపంతో నాలుక తడబడింది. వెనక్కి వాలి మళ్ళీ కళ్ళు మూసుకుంది. ఆమెను అర్థం చేసుకోవడం చాలా కష్టమనిపించింది. ఏ మాట అంటే ఏ విధంగా రియాక్ట్ అవుతుందో అర్థం కావడం లేదు. నేను మౌనంగా ఉండిపోయా.

ఆమె కళ్ళు విప్పకుండానే మాట్లాడసాగింది - తెలంగాణా సాయుధ పోరాటం ఉప్పెనలా విరుచుకుపడింది. రాజారావుకు 30 ఏళ్ళు కూడా లేవు. పార్టీ పనుల్లో తలమునకలవుతూ ఉండేవాడు. జమీందారు కూతుర్నే. కానీ నేనూ ఆ ప్రవాహంలో పడ్డా. ఆ పోరాటం అందించిన స్ఫూర్తి అది. ఈ కల్లోలంలోనే రాజారావుతో నాకు పెళ్ళయింది. ఇద్దరం ఇష్టపడే చేసుకున్నాం పార్టీ పెద్దల సమక్షంలో. కళ్ళు తెరిచింది. ఆమె ముఖం కాంతులు వెదజల్లుతోంది. నావైపు చూసింది. ''రాజారావు నీకు తెలుసా?'' అని అడిగింది.

''తెలుసు'' అని ముక్తసరిగా జవాబిచ్చా.

''ఎంత త్యాగమూర్తి అనుకున్నావు. తాను చేసిన త్యాగాలను ఆయన ఎప్పుడూ చెప్పుకోలేదు. అదిగో, అంతటి మహావ్యక్తికి ఈ చీడపురుగు పుట్టాడు. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకునే రకం. మా త్యాగాలను వీళ్ళంతా సొమ్ము చేసుకుంటున్నారు'' అంటూ వలవలా ఏడ్చింది. ఆమెను ఎలా ఓదార్చాలో నాకు అర్థంకాలేదు. అపరాధిలా మౌనంగా కూర్చుండిపోయా. కాస్త తేటపడి చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది. ''ఇవన్నీ చెప్పి నీకు బాధ కలిగిస్తున్నా'' అంది. ''అదేం లేదు చెప్పండి'' అంటూ టేపురికార్డర్ ఆన్ చేయడానికి ప్రయత్నం చేశాను. నా ప్రయత్నాన్ని గమనించి రాజేశ్వరమ్మ టేపురికార్డర్ లాక్కొని సోఫాలో తన పక్కన పడేసింది. చీరకొంగుతో మరోసారి ముఖమంతా తుడుచుకొని - ''మా అమ్మమ్మ, మా నాయనమ్మ ఇచ్చిన నగలు బోలెడుండేవి నా దగ్గర. వాటిని పార్టీకి ఇచ్చేయమని రాజారావు పెళ్ళికి ముందే చెప్పాడు. ఆయన చెప్పిన ప్రకారమే చేశా. మేం కూడా అందరితోపాటు అదే కాలనీలో వుండేవాళ్ళం. ఎవరింట్లోనూ అవసరానికి మించి సరుకులుగానీ, వస్తువులుగానీ ఉండేవి కావు. అలంకార వస్తువులైతే మచ్చుకైనా కనిపించేవి కావు'' అంది. నేను ఆసక్తిగా వినసాగాను. ''ఆ రోజుల్లో నాయకుల ప్రైవేట్ జీవితాలు, పబ్లిక్ జీవితాలు వేర్వేరుగా ఉండేవి కావు'' అని నెమరేసుకుంటూ చెప్పింది.

''మీ వారు కూడా ఇటీవలి దాకా పార్టీలో ఉన్నారు కదా! ఎట్లా ఉండగలిగారు?'' అని ప్రశ్నించా.

''రాజారావు ఎంత నిక్కచ్చిగా ఉండేవారనీ...'' అంటూ దారానికి పూసలను గుచ్చినట్లు ఒక్కొక్క జ్ఞాపకాన్నే నా ముందుంచసాగింది. ''నా నగలన్నీ పార్టీకి ఇచ్చేశానని చెప్పాను కదా, కానీ ఆయనకు తెలియకుండా ఓ గొలుసు దాచిపెట్టా. అదంటే నాకు చాలా ఇష్టం. చనిపోయే ముందు మా అమ్మమ్మ దాన్ని నాకిచ్చింది. దాన్ని దాచిపెట్టానన్న మాటేగానీ అపరాధ భావన నన్ను నిరంతరం కాల్చుకు తినసాగింది''

''ఆ తర్వాతేం జరిగింది?'' అని ప్రశ్నించా.

ఆమె మామూలుగా మాట్లాడుతుండడంతో నాలోని భయం, సంకోచం ఎగిరిపోయాయి.

''అది నా జీవితంలో మరపురాని సంఘటన. ఆ రోజు మా మ్యారేజ్ డే. తలంటు పోసుకుని ఉన్న వాటిల్లో మంచి వస్త్రాలు ధరించి గొలుసు వేసుకున్నాను. ఆయన ఇంట్లో లేరు. అద్దంలో చూసుకున్నా. నా రూపం నాకే కొత్తగా ఉంది. అలా నిలబడిపోయాను. ఎప్పుడొచ్చారో ఆయన నా వెనుకే ఉన్నారు. ఆయనను చూసి నాకు మాటలు రాలేదు. కళ్ళలోకి చూడడానికి భయమేసింది. మెడలోంచి గొలుసుతీసి ఆయనకిచ్చాను. అక్కడి నుంచి వెళ్ళబోయాను''

''రాజేశ్వరీ!'' అంటూ పిల్చారు. ఆయన గొంతు జీరవోయింది. ఏమంటారోననే భయం కన్నా నేను తప్పుచేశాననే భావనే నన్ను ఎక్కువగా వేధించింది ఆ క్షణంలో. నిలబడ్డాను. మాట్లాడలేదు.

''వర్గ లక్షణాలు అంత త్వరగా పోవు'' అన్నారు ఆయనే.

''నాది తప్పే'' అన్నాను ఒప్పుకోలుగా.

''ఇది తప్పొప్పుల సమస్య కాదు రాజేశ్వరీ! వర్గవ్యత్యాసాలు లేని సమాజం గురించి మనం కలలు కంటున్నాం. అందరికీ సమానావకాశాల కోసం పోరాడుతున్నాం. అటువంటి మనమే ఈ ప్రలోభాలకు లొంగిపోతే ఎట్లా?'' అన్నారు.

తలవంచుకుని వినసాగాను. మాట్లాడే సాహసం లేదు. ఆయనే మాట్లాడారు.

''నువ్వీ గొలుసు వేసుకుని ఉండగా కార్యకర్తలు చూశారనుకో. వారెట్లా ఫీలవుతారు? మనం గొప్పవాళ్ళం అనే అభిప్రాయం కలిగించకూడదనే నేను నగలు వద్దని చెప్పా. అలా కలిగించిననాడు మనకూ, వాళ్ళకు మధ్య అభేద్యమైన గోడలు లేస్తాయి. అప్పుడు మనం ప్రజల్లో కలిసి పనిచేయలేం. అలా పనిచేయలేనినాడు ప్రజా ఉద్యమాలు నిర్మించలేం'' అన్నారు బాధగా. ఇదంతా చెబుతున్నపుడు రాజేశ్వరమ్మ ముఖం కాంతులు వెదజల్లుతున్నట్లనిపించింది.

''ఆ గొలుసును ఏం చేశారు''ని అడిగా కుతూహలంగా. ఆమె నావైపోసారి చూసి సోఫాలోంచి లేచి నిలబడి - ''అమ్మేసి తుపాకులు కొన్నాం'' అని చెప్పింది. ఆ విషయం చెబుతున్నపుడు ఆమె ముఖం జ్వాజ్వల్యమానమైంది. క్రమంగా ఆమె ముఖం కళావిహీనం కాసాగింది. సోలి పడబోయింది. రెండు చేతులతో తలను పట్టుకుని తనను తాను నిలువరించుకుంది. నేను సోఫాలోంచి లేచి ఆమె దగ్గరగా వెళ్ళా. ఆమె ఎక్కువసేపు నిలబడలేకపోయింది. హఠాత్తుగా ఒక మహావృక్షంలా కూలిపోయింది. ఆమె పడకుండా నేను చేతులు అడ్డం వేసినా ఫలితం లేకపోయింది. ★

3